క్లుప్తంగా

రిజర్వేషన్ ఇవ్వాలి

భద్రాచలంటౌన్: ఏజెన్సీలోని దళితులకు 15 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని దళిత సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్దా పిచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీలో గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రాంబాబు, ధర్మరాజు, కేశవ్, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

మణుగూరురూరల్: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని ఓసీ 2 నిర్వాసిత గ్రామమైన కొత్త కొండాపురం గిరిజనులకు సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఓసీ 2 పంపు సెక్షన్ కార్మికుల ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీకేఓసీ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.రాముడు చేతుల మీదుగా దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో రక్షణ అధికారి ఎం లింగబాబు, సెక్షన్ ఇన్‌చార్జ్ ఏ.శివకుమార్, హెడ్ ఓవర్ మెన్ ఎండి.జైలుద్దీన్, సింగరేణి సేవా సమితి సభ్యులు నాసర్‌పాషా, పంపు సెక్షన్ కార్మికులు మల్లయ్య, రామం, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం

భద్రాచలంటౌన్: యేసు క్రీస్తు బోధనలను ఆచరించి చేడు వ్యసనాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం ఇన్‌చార్జ్ తెల్లం వెంకట్రావ్ అన్నారు. తెలంగాణ పీస్, భద్రాచలం ప్రేయర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నూతన సంవత్సర వేడుకలకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. చితిర్యాల రవి, వైద్యులు సోమయ్య, విజయరావు, ప్రమీల ఫెలోషిప్ కమిటీ సభ్యులు స్టీవెన్, ఆమోస్, సైమస్, థామస్, ఇస్సాక్, యేసురత్నం, రత్నరాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

దుమ్ముగూడెం: తెలంగాణా ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) 2023 క్యాలెండర్‌ను ఎంఈఓ సున్నం సమ్మయ్య, ఎంపీడీఓ చంద్రమౌళి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బూటారి రాజు, మండల అధ్యక్షుడు జోగారావు, ప్రధాన కార్యదర్శి కార్యదర్శి బి.రవి, రామకృష్ణ, భద్ర, ఉపాధ్యక్షులు. భాస్కర్,సీఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

మందిరంలో అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీ షిర్డీసాయి మందిరంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నూతన సంవత్సరం మొదటి గురువారాన్ని పురస్కరించుకుని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల అధినేత, సాయిబాబా దేవాలయం మాజీ అధ్యక్షుడు దివంగత మాగంటి సూర్యం జ్ఞాపకార్థం ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం నిర్వహిచడంతో పాటు వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు.మాగంటి సూర్యం కుమారులు, లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు శ్రీనివాస ప్రసాద్, రమేష్‌బాబు, ఆయల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్ చేయాలి

ములకలపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజేషన్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. గురువారం ములకలపల్లిలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యేను కలిసిన మండల పరిధిలోని 20 జీపీల కార్యదర్శులు.. మూడు సంవత్సరాలు ప్రొబేషనరీ కాలం పూర్తి చేశామని, తమను వెంటనే రెగ్యులైజేషన్ చేయాలని కోరారు.

పశు వైద్య శిబిరం

దమ్మపేట: మండల పరిధిలోని తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం తాటిసుబ్బన్నగూడెం గ్రామంలో సర్పంచ్ చేతుల మీదుగా పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో గ్రామ పరిధిలోని 25 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సంబంధిత జబ్బులకు మందులతో పాటుగా ఖనిజ మిశ్రమాలు పంపిణీ చేశారు. గొర్రెలకు పరీక్షలు నిర్వహించి, లివర్ టానిక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి మన్యం రమేష్, వైద్య సిబ్బంది, వార్డు సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

భూమి పూజ

అన్నపురెడ్డిపల్లి: మండలంలోని మర్రిగూడెం గ్రామంలో ఎంపీ నామా నాగేశ్వరరావు నిధులతో మంజూరైన రూ.5 లక్షల సీసీ రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ సడియం తిరుపతయ్య భూమి పూజ చేశారు. మండల పార్టీ ప్రతిపాదన మేరకు ఎంపీ నామా నాగేశ్వరరావు నిధులు కేటాయించినందుకు బీఆర్ఎస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు వీరబోయిన వెంకటేశ్వర్లు, తాటి ఎర్రయ్య, పలగాని పుల్లయ్య, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆగని కోతలు!

- ప్రైవేట్ ఆస్పత్రుల్లో యథావిధిగా సిజేరియన్ ప్రసవాలు
- నిలిచిపోయిన అధికారుల తనిఖీలు
- ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లే కారణమా?



భద్రాచలంఅర్బన్: గర్భిణులకు సిజేరియన్ ఆపరేషన్ చేస్తే దీర్ఘకాలిక సమస్యలు ఏర్పడుతాయి. కడుపుకోత కారణంగా శరీరం సహజత్వాన్ని కోల్పోతుంది. మునుపటిలా శరీరం అన్ని పరిస్థితులనూ తట్టుకోలేదు. రక్తస్రావంతో ఆదనపు రక్తాన్ని అందించాల్సిన పరిస్థితి వస్తుంది. దీనికితోడు మొదటి కాన్పు సిజేరియన్ అయితే రెండో కాన్పు కూడా దాదాపు సిజేరియన్ చేయాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణంలో అధికారులు ఎన్ని తనిఖీలు చేసినా.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లు ఆగడంలేదు. ఎన్ని కమిటీలు వేసిన సమాచారం ఇవ్వకుండానే ఆపరేషన్లను నిర్వహిస్తున్నారు. పైగా తనిఖీలు, చర్యలు చేపట్టకుండా ప్రజాప్రతినిధుల అండతో అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సైతం ఎలాంటి చర్యలూ చేపట్టడంలేదు. నోటీసులు ఇచ్చిన ఆస్పత్రులవైపు చూడడం లేదు.

ప్రసవాల సంఖ్య ఇలా...

ఆరు నెలల్లో భద్రాచలంలో నమోదైన మొత్తం కాన్పులు 277. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు 139, ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు 65 జరగగా, సిజేరియన్ల సంఖ్య74 . అదే విధంగా ప్రైవేటు ఆసుపత్రుల్లో కాన్పులు 138, ప్రైవేటు ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు కేవలం 31 మాత్రమే జరగగా, సిజేరియన్లు సంఖ్య మాత్రం 107 కు చేరింది. మొత్తంగా భద్రాచలంలో గత ఏడాది జూలై నుంచి డిసెంబర్ వరకు జరిగిన 277 ప్రసవాల్లో 172 సిజేరియన్ ఆపరేషన్లే చేశారు.

ప్యాకేజీల కింద ప్రసవాలు..

భద్రాచలంలో అన్ని ప్రైవేట్ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలతో పాటు సిజేరియన్లకు ప్యాకేజీల కింద చేపడుతున్నారు. ఆస్పత్రులకు వచ్చే గర్భిణి కుటుంబాలతోముందే ఒప్పందాలు చేసుకుని ప్రసవాలు చేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో సిజేరియన్లు కొనసాగిస్తున్నారు. ప్రతీ సిజేరియన్‌కు రూ.50 నుంచి రూ.80 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఇంత మొత్తం వసూలు చేయడానికి అవకాశం ఉంది కాబట్టి సాధారణ ప్రసవాలు అయ్యే అవకాశం ఉన్నా.. సిజేరియన్ ఆపరేషన్లనే కొనసాగిస్తున్నారు.

సిజేరియన్‌పై నజర్..

భద్రాచలంలోని అన్ని ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలను పెంచేందుకు అధికారులు నజర్ పెట్టారు. గత ఏడాది చివర్లో జిల్లా స్థాయి అధికారులు పట్టణంలోని కొన్ని ఆస్పత్రుల్లో తనిఖీలను నిర్వహించారు. సిజేరియన్లను తగ్గించి సాధారణ ప్రసవాలను పెంచాలని కోరారు. అన్ని ఆస్పత్రుల యజమాన్యాలతో సమావేశాలు నిర్వహించారు. ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు అవసరమైతేనే సిజేరియన్లు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రులకు నోటీసులు ఇచ్చారు.

తనిఖీలు నిలిపివేయాలని ఒత్తిడి..

పట్టణంలోని ఆస్పత్రులపై తనిఖీలు బాగా పెరగడం, అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేయడంతో ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, యాజమాన్యాలు రింగ్‌గా మారారు. స్థానికంగా, జిల్లా స్థాయిలో ఎవరి స్థాయికి వారు తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించారు. వివిధ మార్గాల ద్వారా జిల్లా అధికారులకు చెప్పించారు. ఆస్పత్రులపైన తనిఖీలు నిలిపివేసే విధంగా ఒత్తిళ్లను తీసుకువచ్చారు. ఆ మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో పాటు ఇతర అధికారులు ఆ వైపు రాకుండా విజయవంతం అయ్యారు. ఇప్పటి వరకు ఇచ్చిన నోటీసులపైన కూడా చర్యలు తీసుకోకుండా ఉండేవిధంగా ఉన్నతాధికారులతో చెప్పించుకోవడం గమనార్హం. వెరసి సిజేరియన్లను యథావిధిగా కొనసాగిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం



ప్రభుత్వాస్పత్రిలో ప్రసవ వైద్య సేవలు బలోపేతమయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న సిజేరియన్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిబంధనలు పాటించని ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకుంటాం. తరచూ నిర్వహించే సమావేశాల్లోనూ సిజేరియన్ కాన్పులు తగ్గించాలని సూచిస్తున్నాం.

– డాక్టర్ లక్ష్మీశిరీష, డీఎంహెచ్‌ఓ, భద్రాద్రి కొత్తగూడెం

పాఠశాలల సందర్శన



పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేక బృందం సభ్యులు

అశ్వారావుపేట: మండలంలో పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలను మండల ప్రత్యేక బృందం గురువారం పరిశీలించింది. మండలంలోని వినాయకపురం కాలనీ, పీఎమ్మెస్ నారాయణపురం, యూపీఎస్ నారంవారిగూడెం, దొంతికుంట , నెహ్రూనగర్, అశ్వారావుపేట బీసీకాలనీ పాఠశాలలను ప్రత్యేక బృందం పరిశీలించింది. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా నింపిన వివరాలు సరైనవా? కావా?అని పరిశీలించారు. పాఠశాలల తరగతి గదులు, పాఠశాలలో వినూత్న కార్యక్రమాలు, మధ్యాహ్న భోజన సదుపాయాలు, డిజిటల్ బోధన వంటి వివిధ అంశాలను పరిశీలించారు. ఆయా అంశాలను జిల్లా అధికారులకు నివేదించనున్నట్లు ప్రత్యేక బృందం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణయ్య , నోడల్ అధికారి పుల్లయ్య, జగపతయ్య, మస్తాన్‌ఆలీ, ఎఫ్.ఎల్.ఆర్.పి కట్టా మధు, సీఆర్‌పీ ప్రభాకరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి కేసీఆర్ కప్ క్రీడా పోటీలు

మణుగూరురూరల్: సంక్రాంతి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని రేగా విష్ణు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీ నుంచి 13వ తేదీ వరకు కేసీఆర్ కప్ పినపాక నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలను నిర్వహించనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ సాంస్కృతిక విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు ఆవుల నర్సింహారావు గురువారం తెలిపారు. వాలీబాల్, షటిల్, చెస్, క్యారమ్స్, 5కె రన్, 3కె రన్, 2కె రన్, టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. వాలీబాల్ పోటీలను నాకౌట్ టీం లీగ్ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. టగ్ ఆఫ్ వార్‌లో మండలానికి ఒక్క జట్టు మాత్రమే పాల్గొనాలని తెలిపారు, మహిళలకు టెన్నికాయిట్, మ్యూజికల్‌చైర్, లెమన్ అండ్ స్పూన్ పోటీలను నిర్వహించనున్నామన్నారు. క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు గురువారంలోగా నమోదు చేసుకున్న క్రీడాకారులకు, జట్ల వివరాలను మాత్రమే నేడు డ్రా తీయనున్నట్లు తెలిపారు. క్రీడల్లో గెలుపొందిన వారికి 13వ తేదీన బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. 9177045995, 9908677714, 6281178099 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

దుమ్ముగూడెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యన్‌యస్‌యస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సీఐ దోమల రమేష్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ టి.కొమురయ్య సైబర్ క్రైమ్‌లు, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపితే వచ్చే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యన్‌యస్‌యస్ ప్రోగ్రామ్ అధికారి ఎం .శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది యన్‌యస్‌యస్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బాధిత కుటుంబానికి వితరణ



వితరణ అందజేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి, సంస్థ నిర్వాహకులు, డాక్టర్ సుబాని

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన గుంజాల కృష్ణ కుటుంబానికి గురువారం ఎమ్మెల్యే సీతక్క కుమారుడు ధనసరి సూర్య బియ్యం, నిత్యావసర వస్తువులు, గిన్నెలు వితరణగా అందజేశారు. దాతలు ముందుకు వచ్చి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గాదె కేశవ రెడ్డి, మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఉపేందర్, పాములు, వెంకటరమణ, రహీంఖాన్, రాము, సందీప్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, నరసింహారావు, సైదులు, చెన్నయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

జనం కోసం మనం సంస్థ వితరణ

అగ్ని ప్రమాద బాధిత గుంజాల కృష్ణ కుటుంబానికి మణుగూరు పట్టణానికి చెందిన జనం కోసం మనం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం రూ.10 వేలు, వంట పాత్రలు, దుస్తులు, భద్రాచలం పట్టణానికి చెందిన దుర్గా స్వీట్స్ అధినేత బిర్రు సుధాకర్ దంపతులు 50 కేజీల బియ్యం, మొండికుంట గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు డాక్టర్ సుబాని రూ.1000 గ్రామ సర్పంచ్ కోడి కృష్ణవేణి చేతుల మీదుగా కృష్ణ కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ గూడురు కృష్ణారెడ్డి, సభ్యులు పునాటి పాపయ్య, సుభాని, గ్రామస్తులు ఐలయ్య, మురళి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామానికి చెందిన గుంజాల కృష్ణ పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో అశ్వాపురం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం బాధిత కుటుంబానికి రూ.5 వేలు, 25 కేజీల బియ్యం, దుస్తులు, ఇతర సామగ్రిని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంతెన రత్నాకర్, కమటం నరేష్, సభ్యులు చార్టర్ ప్రెసిడెంట్ గాదె కేశవరెడ్డి, సజ్జా శ్రీను, సింగం శ్రీధర్, వర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: తన భర్త మానసిక వేధింపులకు గురి చేస్తున్నట్లు ఓ మహిళ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన సెలవల శిరీష అనే మహిళకు కొన్నేళ్ల క్రితం సెల్వరాజు అనే వ్యక్తితో పెళ్లి జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వృత్తి పరంగా సెల్వరాజు కొత్తగూడెంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా చేస్తున్నాడు. ఈ క్రమంలో గత కొంత కాలంగా సెల్వరాజు మానసికంగా తనను వేదిస్తూన్నాడని, శిరీష గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

బాధ్యతల స్వీకరణ

అశ్వారావుపేట: అశ్వారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా నియమించబడిన డాక్టర్ కృష్ణదీపక్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన డాక్టర్‌కు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పుష్ప గుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందిస్తానని డాక్టర్ కృష్ణదీపక్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గ కన్వీనర్‌గా 'రావులపల్లి'



చర్ల: సీపీఐ పార్టీ భద్రాచలం నియోజకవర్గ కన్వీనర్‌గా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్న రావులపల్లి రాంప్రసాద్‌ను ఎంపిక చేశారు. గురువారం చర్లలో జరిగిన పార్టీ నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సమక్షంలో ఈ ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా రావులపల్లి రాంప్రసాద్ మాట్లాడుతూ.. కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో సీపీఐని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దుతానని చెప్పారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడిగా వరప్రసాద్

దుమ్ముగూడెం: పీఆర్‌టీయూ దుమ్ముగూడెం మండల సర్వసభ్య సమావేశం మండల ప్రధాన కార్యదర్శి పి.హేస్టింగ్ అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడిగా కేవీఆర్ వరప్రసాద్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారంపూడి దశంబాబు, టి.మోహన్ బాబు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అబ్బయ్యకు ఘన నివాళి

అశ్వాపురం: మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామంలో పార్టీ సీనియర్ నాయకుడు, గ్రామ మొట్టమొదటి సర్పంచ్ దానూరి అబ్బయ్య 24వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. అబ్బయ్య చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య మాట్లాడారు. ఎమ్మెల్యే సీతక్క కుమారుడు ధనసరి సూర్య, సీనియర్ నాయకుడు గాదె కేశవరెడ్డి, ఉపేందర్, పాములు, వెంకటరమణ, చెంచల రాము, మానాది సైదులు, చెన్నయ్య, మహేష్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

దమ్మపేట: మండల కేంద్రంలోని స్థానిక తహసీల్‌లో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతులమీదుగా అందజేశారు. అనంతరం ముష్టిబండ గ్రామ శివారులో గల రంగనాథ స్వామి ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు, తహసీల్దార్ స్వామి, బీఆర్ఎస్ నాయకులు యార్లగడ్డ బాబు, అబ్దుల్‌జిన్నా, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లి: మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద గురువారం 64 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పంపిణీ చేశారు. దళితబంధు ద్వారా మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన సిద్దెల అన్వేష్‌కు మంజూరైన కారును అందించిన ఎమ్మెల్యే మెచ్చా.. కారును స్వయంగా నడిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్ల నాగమణి, తహసీల్దార్ వీరభద్రం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోరంపుడి అప్పారావు, కార్యదర్శి శనగపాటి అంజన్‌రావు, నాయకులు పువ్వల మంగపతి, పుష్పాల చంద్రరావు, కొండవీటి రాజారావు, శనగపాటి సీతారాములు,పర్వతనేని అమర్‌నాథ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

సమస్యలు పరిష్కరించాలి

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దుమ్ముగూడెం బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం జిల్లా మంత్రి పువ్వాడ అజయ్‌ని ఖమ్మం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, డబుల్ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసి అధికారికంగా గృహప్రవేశాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణమూర్తి, కార్యదర్శి కణితి రాముడు, అధికార ప్రతినిధి ఎండి.జానీపాషా, బొల్లి వెంకటరమణ, రామారావు, తిరుపతిరావు, కామేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారికి సన్మానం



డాక్టర్లు మౌనిక, రామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న వైద్యశాల సిబ్బంది

చర్ల: మండలంలోని సత్యనారాయణపురం పీహెచ్‌సీలో నాలుగున్నరేళ్ల పాటు వైద్యాధికారిగా పనిచేసి బూర్గంపహాడ్‌కు బదిలీ అయిన మౌనికకు గురువారం సిబ్బంది సన్మానించారు. డీపీఎంఓ చింతా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో మౌనిక సేవలు అనిర్వచనీయం అన్నారు. ఎంపీపీ గీదా కోదండ రామయ్య, జెడ్పీటీసీ ఇర్పా శాంత, తహసీల్దార్ బి.భరణిబాబు, భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రామకృష్ణ, వైద్యాధికారులు ఎం.దివ్యనయన, శ్రీధర్, చైతన్యతో పాటు రాంపండు, వీర్రాజు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన 'గ్రీన్ భద్రాద్రి'



మొక్కలు నాటుతున్న పాకాల దుర్గాప్రసాద్

భద్రాచలంఅర్బన్: గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో గురువారం కుండీల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీసీ కాంట్రాక్టర్ పాకాల దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ.. గత 11 సంవత్సరాలుగా పచ్చని భద్రాద్రే లక్ష్యంగా గ్రీన్ భద్రాద్రి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రీన్ భద్రాద్రి అధ్యక్షుడు కామిశెట్టి కృష్ణార్జునరావు, గోళ్ల భూపతిరావు, కుశిని భాస్కర్‌రావు, కుశిని జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం..

బూర్గంపాడు: ప్రభుత్వ విప్ రేగా కాంతారావు చిత్రపటానికి గురువారం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి చెందిన రైతులు, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. నాగినేనిప్రోలు నుంచి ముసలిమడుగు వెళ్లే బారుమడుగు రోడ్డును రూ.4 కోట్లతో బీటీ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేసిన నేపథ్యంలో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సర్పంచ్ భూక్యా శ్రావణి, ఉపసర్పంచ్ యడమకంటి ఝాన్సీలక్ష్మి, సొసైటీ వైస్ చైర్మన్ ఆవుల నాగిరెడ్డి, డైరెక్టర్ కుందురు పెద్దిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, బీఆర్ఎస్ యూత్ మండల ప్రధాన కార్యదర్శి యడమకంటి సుధాకర్‌రెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



బూర్గంపాడు: సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బూర్గంపాడు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు పనిచేయాలని ఆ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7వ తేదీన మణుగూరులో జరిగే పార్టీ పినపాక నియోజకవర్గ స్థాయి సమావేశానికి పార్టీ ముఖ్యులంతా తప్పకుండా హాజరు కావాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా సీతారామ్‌నాయక్, పున్నం భిక్షపతి, ముస్కు శ్రీనివాసరెడ్డి, భూక్యా దివ్యశ్రీ, బిజ్జం శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాలెం రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

అశ్వాపురం: భారతీయ జనతా పార్టీ బలోపేతం కోసం నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులందరూ కృషి చేయాలని బీజేపీ పినపాక నియోజకవర్గ పాలక్ కేతావత్ లాలూనాయక్ అన్నారు. మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య అధ్యక్షతన పార్టీ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా లాలూనాయక్ హాజరై మాట్లాడారు. ఈ నెల 7న మణుగూరులో పోలింగ్ బూత్ కమిటీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ.నడ్డా వర్చువల్‌గా హాజరై మాట్లాడనున్నట్లు తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు, ఐకార్ మెంబర్ ముస్కు శ్రీనివాస రెడ్డి, పినపాక నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా సీతారాం నాయక్, జిల్లా కార్యదర్శి బత్తుల రామకృష్ణ, నాయకులు భూక్యా వెంకటేశ్వరరావు, పాటి చంద్రశేఖర్, సురకంటి లింగారెడ్డి, గోసుల రాములు, కొల్లు లింగారెడ్డి, సోమ కృష్ణకుమారి, మార్కండేయులు, దేవయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



మండల కేంద్రంలో శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వెళ్లే దారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పిల్లలకు సైతం అందే తక్కువ ఎత్తులో ప్రమాదకరంగా ఉంది. గ్రామంలో నివాసాల మధ్య రహదారి పక్కనే ఉండడంతో ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వచ్చే నెలలో గ్రామంలో మహాశివరాత్రి జాతరకు వేల సంఖ్యలో ప్రజలు ఈ రహదారి వెంటనే వస్తారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎత్తులో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. - అన్నపురెడ్డిపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: తరుణ్, ఏఈ
ఫోన్ నంబర్: 7901624864